క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

దేవనకొండ: గ్రామీణ ప్రాంత ప్రజలు అంటు రోగాలబారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలని పీహెచ్ కేంద్రం వైద్యుడు కల్యాణ్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పీహెచ్ కేంద్రంలో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన ఏఎన్ఎం, ఆశవర్కర్లతో సమావేశం నిర్వహించారు. అంటురోగాల బారిన పడకుండా ఉంటాలంటే పరిశుభ్రత పాటించాలని, శుద్ధజలం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సీహెచ్ఓ భాగ్య మ్మ, హెచ్ ఈ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచి పుస్తకాలే ఉత్తమ స్నేహితులు

ఆలూరు రూరల్: మంచి పుస్తకాలే ఉత్తమ స్నేహితులని, ప్రతి విద్యార్థి మంచి పుస్తకాలను చదివి, అందులోని మంచిని, నీతిని అవగాహన చేసుకుని సత్ప్రవర్తనతో మెలగాలని ఆలూరు గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో కథలు చదివించారు. గణితంపై అవగాహన కల్పించారు. కార్యమ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు డ్యాన్స్ ప్రాక్టీస్ చేయించారు.

చేపల పెంపకానికి వేలం

పత్తికొండ రూరల్ : మండల పరిధిలోని పందికోన గ్రామ సచివాలయంలో మంగళవారం పందికోన రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి బహిరంగ వేలం పాట నిర్వహించారు. వారం కిందట జరగాల్సిన వేలం పాట సీఎం జగన్ మోహన్‌రెడ్డి పర్యటనతో వాయిదా పడింది. గాజుల దిన్నె ప్రాజెక్టు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి చంద్రయ్య ఆధ్వర్యంలో జరిగిన వేలంలో ధరావతు చెల్లించి ఐదుగురు పాల్గొనగా పాల్గొనగా గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు రూ.2,84,310కి దక్కించుకున్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునిస్వామి, ఫిషరీస్ అసిస్టెంట్ వసంత,గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి, హొళగుంద గ్రామాలకు చెందిన అనాథలు, ఒంటరిగా ఉంటున్న వృద్ధులు, వికలాంగులు, మరి కొందరికి మంగళవారం ఆదోని వివేకానంద సేవా సంస్థ, భారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్ష, ఉపాధ్యక్షులు మూర్తి, ప్రకాష్, సిద్దార్థగౌడ్ తదితరుల ఆధ్వర్యంలో బియ్యం, కందిబ్యాళ్లు, వంటనూనె, చక్కర ఇతర సరుకులను అందజేశారు. 17 నెలలుగా ప్రతి నెల ఈ సరుకులను అందిస్తున్నామని సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు రవికాంత్, శ్రీధరశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శివమల్లేశ్వరప్ప



వెల్దుర్తి: సాధారణ బదిలీల్లో భాగంగా వెల్దుర్తి మండల ఎంపీడీఓగా సి.శివమల్లేశ్వరప్ప మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గడివేముల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వర్తించే ఈయన పదోన్నతులలో భాగంగా బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు వెల్దుర్తి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు సైతం గడివేముల ఎంపీడీఓగా బదిలీ అయ్యారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ



ఢిల్లీలో మెమొంటో అందుకుంటున్న హర్షవర్ధన్, వరుణ్‌కుమార్, మాస్టర్ ట్రైనర్ ఫయాజ్

వెల్దుర్తి: మే 26 నుంచి 29వ తేదీ వరకు ఢిల్లీ నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో కర్నూలు జిల్లా క్రీడాకారులు తమ సత్తా చాటారు. వెల్దుర్తికి చెందిన హర్షవర్ధన్ అండర్–12 విభాగంలో విజేతగా నిలవగా, కర్నూలుకు చెందిన వరుణ్ కుమార్ రెగ్యులర్ విభాగంలో రన్నర్‌గా నిలిచాడు. మంగళవారం ఢిల్లీ నుంచి వెల్దుర్తి చేరుకున్న హర్షవర్ధన్‌ను, మాస్టర్ ట్రైనర్ ఫయాజ్‌ను పద్మ వికాస్ స్కూల్ కరెస్పాండెంట్ బడేసా అభినందించారు.

ఏపీఎంగా మధుబాబు

మద్దికెర : వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎంగా మధుబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం సూర్యప్రకాష్ హొళగుందకు బదిలీ అయ్యారు.

గురుకులాల్లో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల్లో మిగిలి ఉన్న(బ్యాక్‌లాగ్) సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ షంషున్నీసా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెల్దుర్తి బాలికల గురుకులంలో 6వ తరగతిలో బీసీ– సీ వారికి ఒక సీటు, ఎస్టీకు ఒక సీటు, గోరంట్ల బాలుర గురుకులంలో 7వ తరగతిలో బీసీ– డీ-1, 8వ తరగతిలో బీసీ– సీ-1, బీసీ డీ-1 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినీ, విద్యార్థులు ఈనెల 12వ తేదీలోపు దరఖాస్తులను గోరంట్ల బాలుర బీసీ గురుకులంలో మాన్యువల్‌గా అందజేయాలన్నారు. వివరాలకు 9866559664 నంబరులో సంప్రదించాలన్నారు.

సాగు... పండగే !

- అన్నదాతకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- ఇటు పెట్టుబడి సాయం.. అటు గిట్టుబాట ధర
- ఖరీఫ్ సాగుకు సంతోషంగా సిద్ధం అవుతున్న రైతన్న



పొలంలో విత్తనాలు వేస్తున్న కూలీలు

ఎమ్మిగనూరు: సాగు దండగ కాదు... పండగ అని నిరూపిస్తున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఏరువాక సాగుతున్నవేళ సాగుకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలుస్తుండడంతో అన్నదాత సంతోషంగా వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యాడు. రైతును రాజును చేయాలనే సంకల్పంతో రాజన్న బిడ్డ అమలు పరుస్తున్న 'వైఎస్ఆర్ రైతు భరోసా' పథకం యేటేటా లక్షల మంది రైతు కుటుంబాల్లో ఆనందం నింపుతోంది. ఆసరగా ప్రభుత్వం ఉంటుందనే భరోసాను అన్నదాతలకు కలిగిస్తోంది. సీఎం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం ద్వారా ప్రతియేటా అన్నదాత ముంగిట సిరుల పంటకు జీవం పోస్తుంది. పంటకు పెట్టుబడి కింద యేటా రూ.12,500, పంటసాగప్పుడే గిట్టుబాటుధర నిర్ణయం, పంటల బీమా ప్రీమియం చెల్లింపు, వడ్డీలేని రుణాలు మంజూరు, ధరల స్థిరీకణకు రూ.3వేలకోట్లతో నిధి, విపత్తులను ఎదుర్కొనేందుకు రూ.4వేలకోట్లతో నిధి, కౌలురైతులకు ప్రత్యేక కార్డుల మంజూరు తదితర పథకాలు రైతుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచాయి. అంతేకాకుండా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో శీతలగిడ్డంగి, వేర్‌హౌస్‌లను ఏర్పాటు చేస్తుంది ప్రభుత్వం. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో రైతుల పంటసాగుకు అవసరమైన సబ్సిడీ విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నారు అధికారులు. క్షేత్రస్థాయిలోనే అధికారులు అందుబాటులో ఉంటూ పంట బీమా, ఈక్రాప్ నమోదు, పంట యాజమాన్య పద్ధతులు, మెలకువలను రైతులకు అందిస్తున్నారు. పంట దిగుబడులను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. రబీలో రైతుల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న పంట బిల్లులను రైతుల అకౌంట్లలో జమ చేసింది. ఖరీఫ్ పంట ప్రారంభంకు ముందే రైతు భరోసా పెట్టుబడి సాయం, కొనుగోలు చేసిన మొక్కజొన్నకు పది రోజుల వ్యవధిలోనే బిల్లుల చెల్లింపు చేస్తుండటంతో రైతులు ఏరువాకను ఉత్సాహంగా మొదలు పెడుతున్నారు. ఈ యేడు కూడా వర్షాలు సమృద్ధిగా ఉంటాయని శాస్త్రవేత్తలు పేర్కొంటుడటం అన్నదాతకు శుభ పరిణామం.

నియోజక వర్గంలోని రైతుల వివరాలు..

మండలం	సాగుభూమి(ఎకరాల్లో)	రైతులు
నందవరం	42,875	14,557
ఎమ్మిగనూరు	51,738	15,703
గోనెగండ్ల	53,377	16,401
మొత్తం	1,47,990	44,661

ఏటేటా రైతుకు సాయం



ప్రతి సంవత్సరం పంట సాగుచేసే సమయానికే రైతు భరోసా సాయం అందించడం గొప్పవరం. రాజన్న బిడ్డ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కష్టాలు తెలిసిన నాయకుడు. అందరి కష్టాలు తన కష్టంగానే చూస్తూ సాయం చేసే గొప్ప సీఎం. పంటలకు ఇన్సురెన్స్ తనే చేయిస్తాడు.. ప్రభుత్వమే గిట్టుబాటు రేట్లకు కొనేలా చేస్తున్నాడు. ప్రస్తుతం సాగు లాభదాయకంగా ఉంది.

– నరసమ్మ, మహిళారైతు, గోనెగండ్ల

మొక్కజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేసింది



మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ప్రభుత్వమే క్వింటాం రూ. 1962 చొప్పున కొనుగోలు చేసింది. 475 సంచుల దిగుబడి వచ్చింది. ప్రభుత్వమే కొనుగోలు చేసి పదిరోజుల్లో మా అకౌంట్‌లో నగదు జమ చేస్తోంది. బయట వ్యాపారులు రూ.1,750 కొనుగోలు చేస్తే ప్రభుత్వం రూ.210 ఎక్కువకు కొనుగోలు చేస్తుండటం రైతులకు ఎంతో ప్రయోజనం.

– పి.బందెనవాజ్,ముగతి

ప్రతిరైతు పంట పండేలా చర్యలు



ఈయేడాది ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. ప్రతి రైతు సాగుచేసే పంటలన్నీ పండేలా చూడాలని ప్రభుత్వ ఆదేశాలు. రైతులు కూడా విత్తనాలు, ఎరువుల ఎంపికపై అవగాహన పెంచుకోవాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– మహ్మద్ ఖాద్రి ఏడీఏ

విద్యుత్ పొదుపు తప్పనిసరి

ఆలూరు రూరల్: వినియోగదారులు తప్పనిసరిగా విద్యుత్ పొదుపు చేయాలని ఆలూరు డిప్యూటీ డివిజనల్ ఇంజినీరు నాగేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక డీఈఈ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ నిత్య జీవితంలో ఎంతో ప్రధానంగా మారిందన్నారు. విద్యుత్‌ను వృథాచేయకుండా పొదుపుగా వాడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయానికి పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ అంతరాయం లేకుండా అందిస్తున్నామని చెప్పారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఖరీఫ్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వ్యవసాయ బోరు కనెక్షన్లు పొందే రైతులు త్వరగతిన డీడీలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విత్తన ఎంపికలో మెలకువలు పాటించాలి

చిప్పగిరి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమవడంతో రైతులు విత్తనాల ఎంపికలో మెలకువలు పాటించాలని ఏఈఓ రమాదేవి సూచించారు. మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో పత్తి నాట్లు ఊపందుకున్నాయన్నారు. విత్తనాలు కొనే సమయంలో రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆమోదం పొందిన విత్తానాలనే ఎంపిక చేసుకోవాలన్నారు. నకిలీ విత్తనాల పట్ల జాగ్రత్త వహించాలని హెచ్చరించారు.

మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న మలేరియా అధికారి వెంకటేశ్వర్లు

పత్తికొండ రూరల్ : మలేరియా పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిధిలోని పుచ్చకాయలమాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా వైద్యారోగ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రైడే పాటించేలా చూడాలన్నారు. కొబ్బరి బోండాలు, టెంకాయ చిప్పలు, వాడిపడేసిన టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు, నీరు నిల్వలేకుడా చూడాలన్నారు. సాయంత్రం వేపాకు పొగ వేసుకునే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రామకృష్ణ, సూపర్‌వైజర్‌లు వెంకటరామయ్య, లక్ష్మీదేవి, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలూరు అభివృద్ధే మంత్రి ధ్యేయం

ఆలూరు: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పని చేస్తున్నారని కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ ఉమాంబ అన్నారు. మంగళవారం దేవనకొండలోని ఎంపీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ సమస్య ఉన్నా నేరుగా మంత్రి ఇంటికి వెళ్లి విన్నవిస్తే తక్షణమే స్పందించి పరిష్కరిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో దాదాపు రూ.వెయ్యి కోట్ల వరకు నిధులను ఖర్చు వివిధ రకాల అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ప్రస్తుతం దేవనకొండ మండలంలో వైఎస్సార్ చలువ వల్ల నేడు రైతాంగం హెచ్ఎన్ఎస్ కాలువకు సాగునీరు విడుదల కావడంతో అనేకరకాలుగా పంటలను సాగు చేసు కుంటున్నారన్నారు.

విజేతలకు బహుతుల ప్రదానం

గోనెగండ్ల: వేసవి సెలవులలో మండల కేంద్రం గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో కేఆర్ గౌడ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాలూకా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. విజేతలకు ఎమ్మిగనూరు బీజేపీ ఇన్‌చార్జ్ కేఆర్ మురహరి రెడ్డి బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి గోనెగండ్లకు చెందిన పూమా క్రికెట్ జట్టుకు రూ.15వేలు, షీల్డ్, రెండవ బహుమతిని గోనెగండ్లకు చెందిన ఢిల్లీ డేర్ డెవిల్స్ క్రికెట్ టీముకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుధానాయుడు, నాయకులు ధనరాజు, ఓబులేష్, మోహన్, హర్ష, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గోనెగండ్ల: పర్యావరణాన్ని రక్షించే బాధ్యత మనందరం తీసుకోవాలని స్కౌట్ మాస్టర్ సంజీవ్ కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్ విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రం చేశారు. గ్రామ పరిసరాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని మనం కాపాడితే...ప్రకృతి మనలను కాపాడుతుందని పేర్కొన్నారు.

ఖరీఫ్‌కు ముందే విత్తనాల పంపిణీ

మద్దికెర : ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే రైతుల సంక్షేమ కోసం 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తుందని ఏఓ రవి, సర్పంచ్ విజయుడు, మండల ఉపాధ్యక్షుడు మహేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తన పంపిణీ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనశుద్ధి చేసి సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఈఓ అనూషా, ఉప సర్పంచ్ రాముడు, వైఎస్సార్సీపీ నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ

మద్దికెర: స్థానిక నగిరేశ్వర దేవాలయంలో ఈనెల 8న ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం చేపడుతున్నామని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు మంగళవారం తెలిపారు. అనంతరం 11 గంటలకు పద్మావతి సమేత శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తామన్నారు. భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలి

మద్దికెర : అతిసారా రాకుండా ముందు జాగ్రత్తలో భాగంగా మొదటి ఆరు నెలల పాటు బిడ్డకు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో ఉధ్రుత అతిసార నియంత్రణ పక్షోత్సవాలలో భాగంగా వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ వైద్యసిబ్బందితో పాటు ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఆరోగ్యం, అతిసార, ఓఆర్ఎస్‌పై అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల పాత్ర కీలకం

ఎమ్మిగనూరురూరల్: గ్రామీణ ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షలు, పారిశుద్ధ్య కమిటీల్లో ఆశ వర్కర్ల పాత్ర కీలకమని మండల వైద్యాధికారిణి డాక్టర్ దుర్గాబాయ్, జలజీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్ట్ పర్యవేక్ష విభాగం సభ్యులు లక్ష్మీనారాయణలు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దైవందిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే సందర్భంగా జలజీవన్ మిషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్లు గంగారత్నమ్మ, సురేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్వేను సద్వినియోగం చేసుకోండి

నందవరం : జగనన్న భూ హక్కు- భూ రక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన ఇళ్ల సర్వేలను రైతులు, ఇంటి లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నిత్యానందరాజు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మాచాపురంలో సర్పంచ్ పల్లదొడ్డి కిష్టప్ప ఆధ్వర్యంలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈటీఆర్ ఈశ్వరయ్య, సమగ్ర సర్వే ఉప తహసీల్దార్ అమీనా బేగం పాల్గొన్నారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



రోడ్డును చదును చేస్తున్న దృశ్యం

హొళగుంద: అధ్వానంగ ఉన్న ధణాపురం–హొళగుంద రోడ్డుకు మంగళవారం వైఎస్సార్సీపీ నాయకులు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. దాదాపు 25 కి.మీ వరకున్న ఈ రోడ్డు డబుల్ రోడ్డు ఏర్పాటుకు రూ.59 కోట్లు నిధులు మంజూరై, పనులు కూడా ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపివేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఆదోని ఆర్టీసీ అధికారులు ఈ రోడ్డులో బస్సులు నడపడం వల్ల నట్లు, బోల్టులు ఊడి రిపేరికొస్తున్నాయని రూటు మార్చారు. కొన్నిటిని రద్దు చేశారు. ఈ విషయాన్ని వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకులు ఈశా, కుమారస్వామి, కోగిలతోట శేషప్ప, తోక వెంకటేష్, మల్లయ్య, మజ్జిగ సిద్దయ్య తదితరులు మంత్రి గుమ్మనూరు జయరాం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు హిటాచితో రోడ్డును గెలికి చదును చేయించే పనులు చేపట్టారు.

మాది ప్రజా ప్రభుత్వం

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- పత్తికొండలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్సీపీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పత్తికొండ పట్టణం గ్రామసచివాలయం-2 పరిధిలో వడ్డేకట్టవీధి, బుల్లేనిగుట్ట, దాసరివీధి, కొండగేరి కాలనీల్లో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి, బ్రోచర్లను అందజేశారు. గ్రామంలో పలు చోట్ల సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే కాకుండా, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. గుర్తించిన సమస్యలను ప్రాధాన్యతపరంగా నిధులు కేటాయించి పరిష్కరించేందుకు తనవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పత్తికొండ మేజర్‌గ్రామపంచాయతీ సర్పంచ్ కొమ్ముదీపిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, మాజీఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ, వైస్ ఎంపీపీ బలరాముడు, ఎంపీటీసీ సభ్యుడు నీలకంఠ, మండల కన్వీనర్ కారం నాగరాజు, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టరు టీఎండీ హుసేన్, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాము కాటుతో ఎద్దులు మృతి

చిప్పగిరి: పాము కాటుతో రూ.లక్షన్నర విలువ చేసే రెండు ఎద్దులు మృతి చెందిన ఘటన మండలంలోని దౌల్తాపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మేకల రామాంజినేయులుకు చెందిన ఎద్దులను పశువుల పాకలో ఉంచారు. పాకలోకి పాము చొరబడి కాటువేయడంతో ఎద్దులు మృతి చెందినట్లు రైతు వాపోయాడు. రెండు ఎద్దులు ఒకేసారి చనిపోవడంతో జీవనోపాధి కోల్పోయాడని, ప్రభుత్వం సదరు రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

లారీలోని డీజిల్ చోరీ

వెల్దుర్తి: హైవే 44పై చెరుకులపాడు క్రాస్‌రోడ్డులో ఆగివున్న లారీ నుంచి దుండగులు డీజిల్ చోరీ చేశారు. సోమవారం రాత్రి డోన్‌కు చెందిన డ్రైవర్ లారీని రహదారి పక్కన ఆపుకొని నిద్ర పోయాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత కారులో వచ్చిన ఇద్దరు దుండగులు చాకచక్యంగా ఆగి ఉన్న లారీ డీజిల్ ట్యాంకు లాక్ తెరచి దాదాపు 200లీటర్ల డీజిల్‌ను క్యాన్‌లలో నింపుకుని కారులో సర్దుకున్నారు. మరో క్యాన్‌లో నింపుకునే ప్రయత్నం చేస్తున్నంతలో అవతలి పక్కన హోటల్ వారు నిద్రలేచి, అరవగా ఆ క్యాన్ అక్కడే ఉంచి కారులో పరారయ్యారు. హైవే పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని విచారించారు.

ఏఎస్ఐ షాజహాన్ మృతి

మద్దికెర: మద్దికెర పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న షాజహాన్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆయన చెన్నై లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారని పోలీసులు తెలిపారు.

పల్లెల్లోనూ మెరుగైన వైద్య సేవలు

నందవరం : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పల్లెల్లోనూ ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని డాక్టర్ సౌజన్యలత పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1 ఆవరణలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు 104 ద్వారా వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ఇంటి వెళ్లి వైద్య సేవలు అందిస్తామన్నారు. వృద్ధులకు షుగర్, బీపీ తదితర వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బలరామ్, సూపర్‌వైజర్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమరివీడు హెచ్ఎంకి డాక్టరేట్



వై.ధనరాజ్

గోనెగండ్ల: మండలంలోని పెద్దమరివీడు ఎంపీ యూపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న వై.ధనరాజ్‌కు డాక్టరేట్ లభించింది. ప్రాథమిక పాఠశాల, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్య ము, బోధన ఆసక్తి, ఉపాధ్యాయుల సమర్థత అనే అంశంపై డాక్టర్. సి గ్రేస్ ఇందిరా, రీసెర్చ్ సూపర్‌వైజర్, అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్‌జేసీఈ గుంటూ రు వారి పర్యవేక్షణలో పరిశోధన(పీహెచ్‌డీ) పూర్తి చేసినందుకు గాను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ధనరాజ్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఆయనను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు



బోయబొంతిరాళ్లలో పికెటింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ యుగంధర్

కృష్ణగిరి: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమని సీఐ యుంగధర్ హెచ్చరించారు. మండల పరిధిలోని బోయబొంతిరాళ్లలో మంగళవారం ఆయన ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పికెటింగ్ సిబ్బందితో మాట్లాడారు. అందరూ ఐకమత్యంగా ఉంటేనే గ్రామాలు అభివృద్ధిలోకి వస్తాయన్నారు. అలాగే రహదారి ప్రమాదాలు, బాలికా చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టండి

ఆలూరు: పోలీసు సర్కిల్ పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆలూరు సీఐ బి. వెంకటేశ్వర్లు పోలీసులను ఆదేశించారు. స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్ఐ, ఏఎస్ఐ, పోలీసులు గ్రామాల్లో అల్లర్లకు కారుకులు, ఫ్యాక్షన్ తగాదాలకు ప్రేరేపిస్తున్న వారిని గుర్తించి వారిపై నిఘా వేసి ఉంచాలన్నారు. గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా కానిస్టేబుళ్లను కూడా విధులకు ఉపయోగించుకుని సమాచారాన్ని రాబట్టాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తనకు సెల్ 9121101157కు సమాచారానం అందించాలన్నారు.

అందుబాటులో వేరుశనగ విత్తనాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని అన్ని ఆర్‌బీకేల్లో సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం వివిధ గ్రామాల రైతులతో మాట్లాడారు. ఈఏడాది ముందస్తు వర్షంతో పొలాలను దుక్కులు దున్ని పంటసాగుకు సిద్ధం చేసుకున్నారన్నారు. అలాగే సరైన సమయంలో సబ్సిడీ వేరుశనగ, కంది, కొర్ర విత్తనాలు కూడా రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని వెంటనే తీసుకెళ్లవచ్చన్నారు.

కొరత లేకుండా ఎరువులు, విత్తనాలు

ఎమ్మిగనూరురూరల్: మండలంలోని రైతులకు ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో యూరియ 867 మెట్రిక్ టన్నులు, డీఏపీ 241 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్ 1112 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 148 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే పత్తి విత్తనాలు 91187 వేల ప్యాకెట్లు, మిరప విత్తనాలు 914 ప్యాకెట్లు నిల్వ ఉన్నాయని చెప్పారు.

ట్రాన్స్ జెండర్లను ఆదుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: ప్రభుత్వం ట్రాన్స్ జెండర్లకు అన్ని సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని ట్రాన్స్ జెండర్ల ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు పద్మనాయక్, తాలుకా అధ్యక్షురాలు రూపనాయక్ కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని సాయిబాబా దేవాలయం ఎదుట ట్రాన్స్ జెండర్ల నూతన అధ్యక్షులు ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులు ఎన్నికైన పద్మనాయక్, రూపనాయక్‌లను సన్మానించి, పట్టణంలో ఊరేగించారు. ట్రాన్స్ జెండర్లు నాగవేణి, ఐష్, రాజీ, నందిని, రాణీ, రేణుక పాల్గొన్నారు.

బీమా నమోదులో నిర్లక్ష్యం వద్దు

కృష్ణగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వైఎస్సార్ బీమా నమోదు కార్యక్రమాన్ని చేయడంలో నిర్లక్ష్యం తగదని ఎంపీడీఓ విశ్వమోహన్ అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. బీమా నమోదు కార్యక్రమంలో సచివాలయ వ్యవస్థలోని వెల్ఫేల్ అసిస్టెంట్‌లు, వలంటీర్లు సమన్వయంతో చేసినప్పుడే లక్ష్యం నేరవేరుతుందన్నారు. మండలంలో 14,262 మంది అర్హులుగా కాగా ఇప్పటివరకు 3,360మందికి నమోదు కావడం జరిగిందన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు



కొత్తకైరవాడిలో పైపులైన్ పనులు పరిశీలిస్తున్న ఏఈ వెంకటరాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు

నందవరం : రాష్ట్ర ప్రభుత్వం నందవరం మండలంలో రూ.21.70 లక్షలతో నీటి ఎద్దటి నివారణకు చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తకైరవాడి గ్రామంలో తాగునీటి కోసం కొత్త పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పల్లెల్లో నీటి ఎద్దటి నివారణకు ప్రభుత్వం ఎంపీపీ నిధులు ద్వారా నాలుగు గ్రామాలకు రూ.21.70 లక్షలు మంజూరు చేసిందన్నారు. కొత్తకై రవాడి గ్రామంలో తుంగభద్ర నది నుంచి గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకు రూ.7.10 లక్షలతో నూతన పైపులైన్ నిర్మాణం చేపట్టామన్నారు. మిట్టసోమపురం గ్రామంలో నాగలదిన్నె పంపుహౌస్ నుంచి గ్రామంలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు వరకు రూ.7.10 లక్షలతో పైపులైన్ నిర్మాణం, జగ్గాపురం గ్రామంలో రూ.3.50లక్షలు, బాపురం గ్రామంలో రూ.4 లక్షలతో హాలహర్వి దేశాయ్ చెరువులో నుంచి ఆయా గ్రామాలకు ఓవర్ హెడ్ ట్యాంకు నీటి సరఫరా చేస్తామన్నారు. బాపురం గ్రామంలో కురవ వీధికి ప్రత్యేక పైపులైన్ నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఆయా గ్రామాల్లో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నీటి సరఫరా చేసి తద్వారా ఇంటింటికి తాగునీరు పైపులైన్ కనెక్షన్లు మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ చాంద్‌బాషా, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న, డీలర్ వెంకటేష్, నరసింహులు, తాయన్న, లింగన్న, కోతి ఈరన్న, నరసరాజు, నరసన్న తదితరులు పాల్గొన్నారు.